రెవెన్యూ సదస్సుకు పది అర్జీలు

ఫిరంగిపురం: మేరికపూడి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం 8 అర్జీలు, భూమి కొలతలకు రెండు అర్జీలు మొత్తం పది అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, వీఆర్వో ముజావర్ పాల్గొన్నారు.

ఉండవల్లి టీడీపీలో ఆధిపత్య పోరు

తాడేపల్లిరూరల్ : ఉండవల్లిలోని స్వచ్ఛంధ సంస్థ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. శుక్రవారం ఈ వైద్య శిబిరం ముగింపు సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నిర్వాహకులు టీడీపీ నాయకులను పిలవడంలో జాప్యం జరిగింది. దీంతో స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వాహకులపై రెచ్చిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ గ్రామంలోనే నివాసముంటున్నారని, గ్రామాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. రోడ్డు గుంతలు కూడా పూడ్చకుండా వివక్షత చూపిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు నాయుడుకి ఎటువంటి ఆపద వచ్చినా మొట్ట మొదట ఆయన ఇంటి వద్దకు వెళ్లి అడ్డుకునేది తామేనంటూ చెప్పుకొచ్చారు. 'మీ సామాజిక వర్గం అని.. పిలుచుకున్నారో వారెవ్వరూ రాలేదు.' అంటూ చెప్పారు. ఆ రోజు కూడా తమ గ్రామం నుంచి వెళ్లి అడ్డుకున్నామన్నారు. ఇంత చేసినా తమకు ఎటువంటి గుర్తింపు ఉండడం లేదని వాపోయారు. ఇలాంటి కార్యక్రమాలు జరిగినపుడు తమను పిలవకపోవడం చాలా దారుణమన్నారు. 'ఎక్కడెక్కడో ఉన్న మీ వర్గానికి చెందిన నాయకులనే పిలుచుకుంటారా.. ఇదెక్కడి న్యాయం.' అంటూ నిలదీశారు. నిర్వాహకులకు స్థానిక టీడీపీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మంత్రి బందోబస్తుకు వచ్చిన పోలీసులు వివాదం ఎందుకు అంటూ టీడీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో తమనే అరెస్ట్ చేస్తారా అంటూ పోలీసుల మీదకు వారు దూసుకువెళ్లారు. పొరపాటు జరిగిందని ఒప్పుకుని మరలా జిల్లా నాయకులు జంగాల సాంబశివరావును, టీడీపీ రూరల్ అధ్యక్షుడు అమర సుబ్బారావును, ఇన్చార్జి అధ్యక్షులు గాదె వినయ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. అంతా అయిపోయిన తరువాత పిలిచి ఉపయోగం ఏమిటంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.



నిర్వాహకుల్ని, పోలీసులను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిచివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. కేఎల్‌రావు కాలనీ పరిధిలోని పోలకంపాడు, ఉండవల్లి సెంటర్, జీయర్ ఆశ్రమం రోడ్, కెఎల్‌రావు కాలనీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, నవులూరు ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్‌లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన

తాడేపల్లిరూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దుగ్గిరాలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ వ్యవస్థలో ప్రధాన భాగమైన పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అహంకారంతో అంబేడ్కర్ ఏమైనా దేవుడా, ఆయనను పదే పదే స్మరిస్తున్నారు, పుణ్యం కావాలంటే దేవుడిని స్మరిస్తే ఏడు జన్మల పుణ్యం వస్తుందని ఎగతాళి చేశారన్నారు. ఈ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జి.శ్రీనివాసరావు, ఎ.సాంబయ్య, సీహెచ్.రాజశేఖర్, వి.కమలాకర్‌రావు, పీసీ రాజు, ఎం.కోటేశ్వరరావు, వి.పంతులు, వి.నగేష్‌కుమార్, ఎం.గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తగా విజయ్ సతీష్



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజ్ఞాన పురానికి చెందిన వై. విజయ్ సతీష్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తగా ఉద్యోగం సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన విజయ్ సతీష్ ఒకటి నుంచి పదవ తరగతి వరకు స్థానిక సెయింట్ జోసఫ్ స్కూల్‌లో చదివారు. అనంతరం రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ(నూజివీడు)లో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం గేట్ పరీక్షలో ఆల్ ఇండియా 265వ ర్యాంకు సాధించాడు. అనంతరం ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ ఇన్ బెంగళూరులో ఎంటెక్ సీట్ సాధించాడు. ఇటీవల ఇస్రో నిర్వహించిన రాత పరీక్షలో ఆలిండియా -16వ ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)లో గ్రూప్-ఏ విభాగంలో శాస్త్రవేత్తగాను, డీఆర్‌డీవో సైంటిస్ట్‌గా గ్రూప్ ఏ విభాగానికి ఎంపికయినట్లు తల్లిదండ్రులు యనమాల బాబు, శౌరీలు తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తగా ఉద్యోగం సాధించిన విజయ్‌సతీష్‌ను పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


'చౌక దుకాణాల' నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి మంగళగిరి పట్టణ రూరల్ పరిధి, దుగ్గిరాల మండలలో చౌక ధరల దుకాణాల నిర్వహణ కోసం రాత పరీక్షలు నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు పరీక్షలకు హాజరు కావాలని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల తహసీల్దార్లు సీతారామయ్య, ఎస్కే సుభాని, సునీత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డిసెంబరు నెలాఖరు సాయంత్రం 5 గంటల లోపు అర్జీలను తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో లేదా రిజిష్టర్ పోస్టు ద్వారా అందజేయాలని తెలిపారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

తాడికొండ: రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్‌కు కార్మికులతో కలిసి అర్జీ అందజేశారు. క్రిస్మస్ పండగ దగ్గరికి వస్తున్నా ఇప్పటి వరకు నవంబర్ నెల జీతం చెల్లించ లేదని చెప్పారు. సకాలంలో జీతాలు చెల్లించకుండా కార్మిక కటుంబాలను ఆర్థిక సమస్యలకు గురిచేస్తున్న ఏజెన్సీపై సీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకొని, బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్ స్పందిస్తూ...జీతాలు సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లేళ్ల సుఖవేణి, మేరీ, సీఐటీయూ నాయకులు పేరం బాబురావు ఉన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టండి



లాం(తాడికొండ): మండలంలోని లాం గ్రామంలో అక్రమ మైనింగ్, గ్రావెల్ తరలింపును అరికట్టాలని శుక్రవారం లాం క్వారీ సొసైటీ సభ్యులు నిరసన తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు తమ క్వారీ సొసైటీకి కనీసం సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేసి కొండల్లో నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదన్నారు. మైనింగ్ ఏడీని ఫోన్ ద్వారా సంప్రదించి, వివరించిన స్పందించడం లేదన్నారు.

పశువుల ఆసుపత్రికి ప్రహరీ నిర్మాణం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని పశువుల ఆసుపత్రి ప్రహరీ నిర్మాణానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. శుక్రవారం నిర్మాణ పనులు చేపట్టారు. రూ.2 లక్షల నిర్మాణ ఖర్చును భరించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

కేఎల్‌యూలో వికసిత్ భారత్‌పై శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో సామాజిక బాధ్యతలు అనే అంశంపై శుక్రవారం ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు ప్రారంభించారు. కేఎల్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో అఖిల భారత సాంకేతిక మండలి సహకారంతో ఈ తరగతులు జరిగాయి. బీబీఏ విభాగాధిపతి డాక్టర్ పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు వికసిత్ భారత్ నిర్మాణంలో తమవంతు కర్తవ్యాలను నిర్వర్తించాలని ఉద్బోధించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఆర్ ఆర్‌డీ డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, ఎంబీఏ, కామర్స్ విభాగాధిపతులు డాక్టర్ కె.హేమదివ్య, డాక్టర్ శాంతకుమారి, నైజీరియా ప్రొఫెసర్ అజిత్ కుమార్‌తో పాటు విదేశీ యూనివర్శిటీల ఆచార్యులు పాల్గొన్నారు.

క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు ప్రారంభం



మేడికొండూరు: పేస్ సొసైటీ ఆధ్వర్యంలో క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు స్థానిక యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి, ప్రిన్సిపల్ ఎం.కోటిరెడ్డి, ఎంపీడీఓ టి.చందన ప్రారంభించారు. యువత మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడా పోటీలు జరిగాయి. విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.





సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కుల పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న తెలుగుదేశం నాయకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో వివిధ అనారోగ్యాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న, చికిత్స పొందాల్సిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తెలుగుదేశం నాయకులు శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దార దాసు, మంగళగిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇట్టా భాస్కర్ మాట్లాడుతూ తాడేపల్లి 1వ వార్డుకు చెందిన కొక్కిలిగడ్డ కనకదుర్గకు ముందస్తు చికిత్స నిమిత్తం రూ. 1,05,343 ఎల్‌ఓసీ చెక్కును, 13వ వార్డుకు చెందిన గుద్దంటి అలేఖ్యకు రూ.18,819 చెక్కును అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, సీనియర్ నాయకులు మాల్యాద్రి రెడ్డి, వెంకటరెడ్డి, కాకుమాను కుమార్, ఎస్కే మస్తాన్, జి. నాగేశ్వరరావు, షేక్ చాంద్, ఎస్సీ సెల్ నాయకులు కొర్రపాటి విజయ్, జోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మంగళగిరి: క్రీస్తు బోధనలు అనుసరణీయమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల నిర్మల ఫార్మసీ కళాశాలతో పాటు పట్టణంలో బాప్టిస్ట్ పేటలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో మంత్రి పాల్గొని, కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. దయ, కరుణ, శాంతి, ప్రేమలకు ఆదర్శమైన క్రీస్తు బోధనలను అందరూ ఆచరించి, ప్రపంచ శాంతికి మార్గదర్శకులుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర లయోలా కళాశాల ఫౌండర్ డైరెక్టర్ బాల బొల్లినేని, కళాశాల డైరెక్టర్ డాక్టర్ యు.శౌరీ, కరస్పాండెంట్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ బి.పాములరెడ్డి, బాప్టిస్ట్ పేట చర్చి సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



ఫిరంగిపురం: మండల కేంద్రానికి చెందిన పాలిటెక్నిక్ రెండో సంవత్సరం విద్యార్థి అశోక్‌కు నుదురుపాడు గ్రామానికి చెందిన వేగా సంస్థ డైరెక్టర్ టి.వీరయ్య నగదు సాయం అందజేశారు. శుక్రవారం గ్రామంలోని షైన్ కోచింగ్ సెంటర్ జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ శాలెంషాలెమ్ విద్యార్థికి నగదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రామారావు ఉన్నారు.

గ్రీవెన్స్ అర్జీలకు సత్వర పరిష్కారం


రైతులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు గ్రీవెన్స్ డేలో విన్నవించిన వెంటనే సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురు రైతులు పాల్గొని, వారి సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించారు. పూలింగ్‌లో భూములిచ్చిన ప్రాంతంలో భూమి వ్యవహారాలకు సంబంధించి -45 అర్జీలు రాగా, ప్రణాళికా విభాగం -3, సామాజిక అభివృద్ధి-1 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపగా మిగిలిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కమిషనర్ ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని, అలా జరిగితే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ గ్రీవెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, జి.రవీంద్ర, ఏజీ చిన్నికృష్ణ, పి.పద్మావతి, కేఎస్ భాగ్యరేఖ, బి.హుస్సేన్ సాహెబ్, కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జిపి రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూములకు కార్మికుల రక్షణ


మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా కార్మికులు కాపాడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలియజేసి మాట్లాడుతూ బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, తాము పడ్డ కష్టానికి కార్మికులు ప్రతిఫలం అడుగుతున్నారని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి న్యాయం చేయాలని, రూ.2వేల కోట్ల విలువ చేసే ఫ్యాక్టరీ భూములను కార్మికులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కూరపాటి కోటేశ్వరరావు, పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, ఎస్కే సుభాని, సాంబయ్య, ఎ.నాగేశ్వరరావు, వై.రమాదేవి, ఎం.గురవయ్య, ఎం.శివకుమారి, టి.దుర్గా భవాని, జి.దుర్గమ్మ, పి.సాంబశివరావు, ఎం.శారద, బాబూరావు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం వైఎస్.జగన్ జన్మదిన వేడుకలు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని నిర్మల్ హృదయ్ సేవా సంస్థలో ఉదయం 11 గంటలకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వనమాబాల వజ్రబాబు పాల్గొంటారని తెలిపారు.

తాడికొండ: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు తుళ్లూరు దొండపాడులో భారీ అన్నదానం, చీరల పంపిణీ అనంతరం కేకు కటింగ్ ఉంటుంది. 11 గంటలకు తాడికొండ బస్టాండ్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పేదలకు పండ్లు, చీరల పంపిణీ చేయనున్నారు. 11:30 గంటలకు మేడికొండూరు పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, పండ్లు పంపిణీ ఉంటుంది. 12 గంటలకు ఫిరంగిపురం నిర్మల్ హృదయ్ అనాథాశ్రమంలో కేకు కటింగ్, అన్నదానం నిర్వహించనున్నారు.

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి శుక్రవారం తెలిపారు.

గృహోపకరణాల షోరూం ప్రారంభం

మంగళగిరి: ఎలక్ట్రానిక్స్ గృహోపకరాల విక్రయంలో విజయ్ డిజిటల్ షో రూమ్ మేటి అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన షోరూమ్‌ను శుక్రవారం మంత్రి లోకేష్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ వస్తువుల విక్రయంలో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అనేక షో రూమ్‌లను ప్రారంభించి వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అభినందనీయమన్నారు. యజమానులు జువ్వాది గంగాధరరావు, రాహుల్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్



తాడేపల్లిరూరల్: రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఉండవల్లి దేవుడు మాన్యం గ్రౌండ్‌లో మాదాల గోవర్ధనరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యతో పాటు వైద్యానికి సమానంగా కేటాయింపులు చేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు అడ్వాన్స్ టెక్నాలజీ వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాదాల గోవర్ధనరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. మొబైల్ వాహనాల ద్వారా అధునాతన టెక్నాలజీతో కార్పొరేట్ స్థాయిలో ప్రజల వద్దకే వెళ్లి ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ డీన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

మంగళగిరి: ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు న్యూ ఢిల్లీలో జరిగిన ఫెడరేషన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన బొల్లినేని చంద్రిక 84 ప్లస్ విభాగంలో ఓవరాల్ బంగారు పతకం అందుకున్నారు. చాంపియన్ షిప్‌లో హయ్యస్ట్ టోటల్ లిఫ్ట్ చేసిన మహిళగా చంద్రిక నిలిచారు. స్క్వాట్ 240 కేజీలు, బెంచ్ ప్రెస్ 100 కేజీలు, డెడ్ లిఫ్ట్ 210 కేజీలు, టోటల్ 550 కేజీలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది. కోచ్‌గా కేఎస్‌పీ నరేంద్ర వ్యవహరించారు.





రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామంలో ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. బంధువులు ఆందోళన నిర్వహించారు. ఎస్‌ఐ వెంకట రవి వివరాల ప్రకారం పెనుమూలికి చెందిన పునిరి నాగరాజు (23) పెనుమూలి నుంచి దుగ్గిరాల వైపు వస్తుండగా దుగ్గిరాల నుంచి పెనుమూలి వైపు వెళుతున్న బ్రిజేష్ కుమార్ ద్విచక్ర వాహనాలు గురువారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన నాగరాజు మృతి చెందాడని, మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు నాగరాజు బంధువులు మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

తాడికొండ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. సైబర్ మోసాలు, నేరాలపై శుక్రవారం తాడికొండలో 300 మంది విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రసంగించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నుంచి చింతచెట్టు కూడలి వరకు నినాదాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు జోజి, నాయక్ పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు నూతక్కి విద్యార్థుల ఎంపిక



నూతక్కి(మంగళగిరి): ఈ నెల 20, 21వ తేదీల్లో బిహార్‌లో జరిగే జాతీయ రగ్బీ పోటీలకు నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ రజనీ నాయక్ శుక్రవారం తెలిపారు. గత నెల 28, 29 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో ప్రతిభ కనబరచి ఎ. శ్రీలక్ష్మి, డి.షారోన్ కృష్ణవల్లి జాతీయ రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.




ప్రజా సేవకుడా..
వర్ధిల్లు వందేళ్ళు
HAPPY BIRTHDAY
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...
మీతోనే మా పయనం.. మీ మాటే మాకు వేదం...
మేకతోటి దయాసాగర్ IRS
ఆదాయపన్ను ప్రిన్సిపల్ కమీషనర్ (VRS)
మేకతోటి సుచరిత
హోం శాఖ మాజీ మంత్రివర్యులు
వైయస్ఆర్‌సిపి సీనియర్ నాయకురాలు